క్లుప్తంగా

ఎమ్మెల్యే వసంతను కలిసిన ముస్లిం నాయకులు



మైలవరం: విదేశీ పర్యటన ముగించుకుని మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌ను స్థానిక ముస్లిం మైనారిటీ నాయకులు కలిసినట్లు వైస్ ఎంపీపీ షేక్ రహీం మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ముస్లిం మైనారిటీ నాయకుడు వలీ భాయ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసిన తాతినేని



తిరువూరు: కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తాతినేని పద్మావతి మంగళవారం తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తిరువూరు నియోజకవర్గంలో సహకార సంఘాల అభివృద్ధికి, ధాన్యం సేకరణ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. రైతులకు ఉపయోగకరంగా ఉండే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో గోదాముల నిర్మాణానికి నిధులు కేటాయించాలని సూచించారు. విస్సన్నపేట జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు రాణి పాల్గొన్నారు.

సర్వేలను పూర్తి చేయాలి



ముసునూరు: ప్రజా సమస్యల పరిష్కారం, వివిధ సర్వేలను వేగంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. సచివాలయాల నిర్మాణాలను సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే అర్జీదారులకు అసౌకర్యం కలగకుండా శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దాసరి సుధ, ఈఓపీఆర్డీ సత్యనారాయణ పాల్గొన్నారు.

స్పందన అర్జీ రీఓపెనింగ్‌పై ఏపీడీ విచారణ



ముసునూరు: ఉపాధి హామీ పనికి 19 మంది హాజరు కాలేదని స్పందనలో అందిన ఫిర్యాదుపై నూజివీడు ఏపీడీ శ్రీనివాసరావు విచారణ నిర్వహించారు. ముసునూరులో 19 మంది పనికి హాజరు కాలేదన్న విషయంపై మంగళవారం ఆయన బహిరంగ క్షేత్ర విచారణ నిర్వహించారు. ఫిర్యాదులో పేర్కొన్న పేర్లను పరిశీలించగా 18 మంది పనికి హాజరైనట్లు వివరించారు. ఆయన మస్టర్లను తనిఖీ చేశారు. ఒక ఉపాధి కూలీ జాబ్ కార్డుపై అతని మనవడు పనికి హాజరైనట్లు తెలిపారు. మస్టర్ చెక్ చేసి, పీడీకి నివేదిక అందజేస్తామని తెలిపారు. విచారణలో ఏపీఓ రోజీలీల, ఈసీ జయప్రసాద్, టీఏ రవికుమార్ పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడకల్చర్: హిమబిందు సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సినీనటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికపై మంగళవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. నగరానికి చెందిన గాయనీ గాయకులు కంచి మల్లీశ్వరి, రంజిత, పద్మావతి, జ్యోతిర్మయి, రేష్మ, సత్య, పి.శ్రీనివాసరావు తదితరులు చిరంజీవి నటించిన చిత్రాల్లోని గీతాలను ఆలపించారు. హిమబిందు సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకురాలు మల్లీశ్వరి మాట్లాడుతూ.. చిరంజీవి సామాజిక సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విశ్రాంత పోలీస్ అధికారి డేవిడ్ రాజు చిరంజీవి సినీ జీవిత విశేషాలను వివరించారు.

పాఠశాలల భవన నిర్మాణాలను పూర్తి చేయాలి

ఎమ్మెల్యే రక్షణనిధి



ఎమ్మెల్యే రక్షణనిధికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

గానుగపాడు(తిరువూరురూరల్): తిరువూరు నియోజకవర్గంలో నాడు–నేడు నిధులతో పాఠశాలల భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే కే రక్షణనిధి తెలిపారు. మండలంలోని గానుగపాడులో నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.కోటీ 70 లక్షలతో జెడ్పీ హైస్కూల్లో నిర్మిస్తున్న ఆధునిక భవనాలు త్వరలో పూర్తవుతాయన్నారు. తిరువూరు నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలలోనూ సమగ్ర వసతులు సమకూర్చి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ వేమిరెడ్డి కృష్ణవేణి, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలి

వర్షాకాలంలో పాముకాటు, కుక్కకాటుకు అధికశాతం ప్రజలు గురవుతున్నందున చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలని జనవిజ్ఞాన వేదిక సభ్యులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే రక్షణనిధిని మంగళవారం కోరారు. గానుగపాడు ప్రాంతంలో ఇటీవల పాముకాటుకు గురైన రైతులు తిరువూరు ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వెళ్లాల్సి వస్తున్నందున చౌటపల్లి పీహెచ్‌సీలో కూడా వైద్యసేవలందించాలని కోరారు.

తోటపల్లి బాలరావమ్మ ఆలయ హుండీ లెక్కింపు



తోటపల్లి బాలరావమ్మ ఆలయంలో హుండీ కానుకలను లెక్కిస్తున్న ధర్మకర్తలు



తిరువూరులో హుండీలో కానుకలను లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

నూజివీడు: ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని దుగ్గిరాల బాలరావమ్మ ఆలయ హుండీలోని కానుకలను దేవదాయశాఖ అధికారులు మంగళవారం లెక్కించారు. ఆరు నెలల కాలానికి హుండీని లెక్కించగా రూ.2,95,395 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ జీ శ్రీనివాస్ తెలిపారు. లెక్కింపు కార్యక్రమాన్ని నూజివీడు గ్రూపు ఆలయాల కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. హుండీ లెక్కింపులో ఆలయ చైర్మన్ వీరంకి వీరాంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు బెజవాడ రాంబాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు బెజవాడ శ్రీహర్ష, సింహాద్రి నరేష్, పామర్తి శివ, పామర్తి పిచ్చయ్య, దాసరి శరత్‌బాబు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: తిరువూరు గ్రూపు దేవాలయాల హుండీలలో కానుకలను మంగళవారం దేవదాయ శాఖాధికారులు లెక్కించారు. తిరువూరు శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో రూ.39,580, శ్రీచంద్రమౌళీశ్వరాలయంలో రూ.26,019, మునుకుళ్ల అంకమ్మ తల్లి ఆలయంలో రూ.2.72 లక్షలు గత ఐదు నెలల్లో భక్తులు వేసిన కానుకల ద్వారా లభించినట్లు గ్రూపు దేవాలయాల మేనేజరు జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు. గన్నవరం డివిజన్ తనిఖీ అధికారి వీ సుధాకర్, శ్రీరామలింగేశ్వరాలయ కమిటీ చైర్మన్ తిరుమలశెట్టి వేణుబాబు, కమిటీ సభ్యులు కిషోర్, సాంబశివరావు పాల్గొన్నారు.

నేడు గృహసారథుల కన్వీనర్ల సమావేశం

తిరువూరు: నియోజకవర్గంలోని గృహసారథుల కన్వీనర్ల సమావేశం బుధవారం సాయంత్రం తిరువూరు మండలం లక్ష్మీపురంలో జరుగుతుందని ఎమ్మెల్యే కే రక్షణనిధి తెలిపారు. గృహసారథులకు, సచివాలయ కన్వీనర్లకు ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలపై ఈ సమావేశంలో అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని గృహసారథుల కన్వీనర్లు ఈ సమావేశానికి విచ్చేయాలని కోరారు.

రోగులకు పండ్లు పంపిణీ

నూజివీడు: పట్టణంలో సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. నూజివీడు నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షుడు సత్రపు సుధీర్ ఆధ్వర్యంలో పెద్దగాంధీ బొమ్మ సెంటర్‌లో కేక్ కట్ చేశారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో రోగులకు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాపు సంక్షేమ సేన నియోజకవర్గ అధ్యక్షుడు ఏనుగుల వెంకటేశ్వరరావు, బర్మా ఫణిబాబు, తోట వెంకట్రావు, సూరిశెట్టి శివ, పాశం నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

పీఎం స్వనిధికి 1,042 మంది ఎంపిక



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో వీధి విక్రయదారులు వ్యాపారం మెరుగుపరచుకోవటానికి పీఎం స్వనిధి పథకం ద్వారా బ్యాంకుల ద్వారా రుణాల మంజూరుకు క్రెడిట్ క్యాంప్‌లో 1,042 మంది ఎంపికయ్యారు. వీఎంసీ పట్టణాభివృద్ధి సాధికారక విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ క్యాంప్‌లో మొత్తం 1,223 దరఖాస్తులు రాగా అందులో 1,042 మందిని ఎంపిక చేశామని ప్రాజెక్ట్ అధికారి శకుంతల తెలిపారు. సర్కిల్–1 పరిధిలో విద్యాధరపురంలో యూనియన్ బ్యాంక్ వద్ద ఉన్న 117వ సచివాలయంలో జరిగిన క్రెడిట్ క్యాంప్‌లో 324 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 306 మంది ఎంపికయ్యారన్నారు. సర్కిల్–2 పరిధిలో గవర్నర్‌పేటలోని ఐవీ ప్యాలెస్ వద్ద జరిగిన కార్యక్రమంలో 546 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 472 మంది రుణాలకు అర్హత సాధించారన్నారు. సర్కిల్–3 పరిధిలో కృష్ణలంక శాంపిల్ బిల్డింగ్‌లోని 79వ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో 353 మంది రాగా అందులో 264 మంది రుణ అర్హత పొందారని చెప్పారు.

బాధిత కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే



ముసగపాడులో నర్సింహారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

జి.కొండూరు: మండలంలోని పలు గ్రామాలలో అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాలతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ మంగళవారం పరామర్శించారు. జి.కొండూరుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పల్లె ప్రేమ్‌కుమార్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందగా అతడి భౌతిక కాయానికి ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా ఇదే గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ ఏడో వార్డు సభ్యుడు పోలిశెట్టి శ్రీనివాసరావు అనారోగ్యంతో సోమవారం మృతి చెందగా అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మునగపాడు గ్రామానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ చుండూరు విష్ణువర్ధన్‌రావు తండ్రి నర్సింహారావు కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న క్రమంలో బాధితుడ్ని ఎమ్మెల్యే, స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు తానెప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

మనుగడ కోసమే జనసేన నాయకుల తాపత్రయం

నూజివీడు: ఆగిరిపల్లిలోని మెట్ల కోనేరు సమీపంలో ఉన్న (రుద్రభూమి) దేవదాయశాఖకు చెందిన 3.26 ఎకరాల భూమిలో ఉన్న ఆక్రమణలను తొలగించి అభివృద్ధి చేస్తుంటే జనసేన నాయకులకు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందని అభివృద్ధి కమిటీ సభ్యులు ధ్వజమెత్తారు. ఆగిరిపల్లిలో మంగళవారం వారు మాట్లాడుతూ జనసేన నాయకులు అభివృద్ధి నిరోధకులుగా తయారయ్యారని దుయ్యబట్టారు. శ్మశాన అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పొన్నం వెంకట లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు నక్కనబోయిన శ్రీమన్నారాయణ, ఎంపీటీసీ సభ్యులు షేక్ నాగుల్‌మీరా, సాధం గోపీనాథ్, టీడీపీ, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పామర్తి నరసింహారావు, చిమటా శ్రీనివాసరావు మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు మచ్చా హరిబాబు రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఆక్రమణలు తొలగిస్తున్నారనడం అవివేకమన్నారు. కరోనా సమయంలో శ్మశానంలోకి మృతదేహాలను తీసుకెళ్తుంటే ఆక్రమణదారులు అడ్డుకున్నారన్నారు. ఇప్పటికే పడమర, తూర్పు వైపు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఫెన్సింగ్ రాళ్లను వేశామన్నారు. శ్రీ వ్యాఘ్ర లక్ష్మీనరసింహాస్వామి ఆలయానికి అనుసంధానంగా ఇక్కడ ఉన్న కనకదుర్గమ్మ ఆలయం వేదపండితులతో పూజలందుకుంటోందన్నారు. ఆక్రమణదారులు ఆలయ పరిసరాల్లో పందులు పెంచడం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడటం, ఇరువైపులా మాంసం దుకాణాలు నిర్వహించడం, కోడిపందేలు, పేకాట వంటి జూదాలు జరుగుతున్నాయని, దీని వల్ల ఆలయానికి వెళ్లే భక్తులకు అసౌకర్యం కలుగుతోందన్నారు. తొమ్మిది మందికి ఎమ్మెల్యే ప్రతాప్ ఆదేశాల మేరకు ఇళ్ల స్థలాలు ఇచ్చినప్పటికీ ఆక్రమణలను ఖాళీ చేయకుండా ఆ స్థలాలను విక్రయించుకున్నారని వివరించారు. ఇంకా 40మంది ఆక్రమణదారులున్నారని, వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదేశించారని తెలిపారు. ఇవేమీ తెలియని జనసేన నాయకులు తమ మనుగడ కోసం ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే గౌరవం పెరుగుతుందని హితవు పలికారు.

పర్యాటకులను ఆకర్షించేలా స్మృతివనం

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



స్మృతివనం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


పటమట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి పర్యవేక్షణలో ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా అంబేడ్కర్ స్మృతివనం పనులు చేపడుతున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. నగరంలోని స్వరాజ్ మైదానంలో నిర్మాణంలో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహ స్మృతివనం నిర్మాణ పనులను మంగళవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. స్మృతివనం పనులను సీఎం వైఎస్ జగన్, ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తూ పలు సూచనలు చేస్తున్నారన్నారు. డిజిటల్ మ్యూజియం, మినీ థియేటర్ నిర్మాణపు పనులు దాదాపు పూర్తయ్యాయని, లైటింగ్, గ్రానైట్, పాత్ వే, వాటర్ ఫౌంటెన్, వెహికల్ పార్కింగ్, ఎలక్ట్రిసిటీ, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ సుందరీకరణ తదితర పనులను మరింత వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. నిర్మాణ పనులను రానున్న రెండు నెలల్లో పూర్తిచేసి ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. పనులు పరిశీలన వారిలో ఏపీ ఐఐసీ చీఫ్ ఇంజినీర్ నరసింహారావు, జోనల్ మేనేజర్ సీతారాం, డెప్యూటీ జోనల్ మేనేజర్ రహీమ్, కేపీసీ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వాసుదేవరావు, ప్రాజెక్ట్ మేనేజర్లు కె.కృష్ణమోహన్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరంలో దొంగల భయం

మైలవరం: మైలవరంలో దొంగల భయంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కొత్తగా గృహ ప్రవేశం చేసిన ఏ వెంకటేశ్వరరావు ఇంట్లో దొంగలు గత రాత్రి దొంగ తనానికి ప్రయత్నిస్తుండగా అటుగా వెళుతున్న పాత్రికేయుడు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చి, దొంగలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. వారు ప్రతిఘటించి పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్సై హరిప్రసాద్ సిబ్బందిని సంఘటన స్థలానికి పంపించగా అప్పటికే వారు పారిపోయారు. కాగా ఇటీవల శివాజీ వీధిలో నివాసం ఉంటున్న డీటీ ప్రసాద్, స్థానిక సెయింట్ మేరీస్ స్కూల్ వెనుక మరో ప్రభుత్వ ఉద్యోగి నివాసాలలో దొంగతనాలు జరిగాయి. అలాగే బండ్‌గర్‌లో పాల మ్ముకునే వ్యక్తి ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. దొంగతనాల నివారణకు పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. దొంగ తనాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వెంటనే సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని ఎస్సై హరిప్రసాద్ తెలిపారు.

పోస్టాఫీస్ పథకాలతో పేదలకు మేలు

బాధిత కుటుంబానికి బీమా నగదు అందజేత



వలసపల్లిలో నగదు అందజేస్తున్న నాయకులు, అధికారులు

ముసునూరు: పోస్టాఫీస్ పథకాలతో పేదలకు మేలు కలుగుతుందని సర్పంచ్ చలసాని దామోదర్ పేర్కొన్నారు. మండలంలోని వలసపల్లికి చెందిన చిట్టిమాద వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతను పోస్టాఫీస్ ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన బీమా పథకం సభ్యుడు కావడం, రూ.426 ప్రీమియం చెల్లించడంతో రూ.2 లక్షలను నామినీకి మంగళవారం పోస్టల్ ఎస్పీ శ్రీనివాసమూర్తి, నేతలతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ డీవీ సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు దేవినేని సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యం

- సొసైటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన
- కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి



పీఏసీఎస్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కేడీసీసీబీ చైర్‌పర్సన్ పద్మావతి, ఎమ్మెల్యే ప్రతాప్

నూజివీడు: రైతుల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (కేడీసీసీబీ) చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. నూజివీడు పీఏసీఎస్‌కు రూ.50 లక్షలతో నిర్మించనున్న భవన నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావుతో కలిసి తాతినేని పద్మావతి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 425 సొసైటీలతో 57బ్రాంచిలతో రూ.10,112కోట్ల టర్నోవర్‌తో కేడీసీసీబీ రాష్ట్రంలోనే తొలిస్థానంలో ఉందన్నారు. రైతులకు పంట రుణాలే కాకుండా రైతునేస్తం, కర్షకమిత్ర, వాహన, విద్యా రుణాలను సైతం ఇస్తోందన్నారు. డ్వాక్రా సంఘాలకు లింకేజీ రుణాలను గ్రూపునకు రూ.20లక్షలు మంజూరు చేస్తున్నామన్నారు. జిల్లాలో 170 సొసైటీలకు నూతన భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. జగనన్న కాలనీల్లో నివేశన స్థలం ఉండి గృహం నిర్మించుకునే లబ్ధిదారులు డ్వాక్రా సంఘాల్లో సభ్యులైతే వారికి రూ.2లక్షల వరకు రుణాన్ని అందిస్తున్నామన్నారు. బంగారు నగల తాకట్టుపై రూ.3లక్షల వరకు ఏడు శాతం వడ్డీకి రుణాలను అందించాలని నిర్ణయించామన్నారు. పంట రుణాలను స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌పై 30శాతం అదనంగా ఇస్తున్నామన్నారు. అవకాశం ఉన్నచోట్ల పెట్రోలు బంకులను సైతం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి అని, సాధ్యమైనంత వరకు రైతులకు మేలు చేయడానికే నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలన్నారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ రైతుల ప్రయోజనార్థం సొసైటీ అద్దె భవనంలో అసౌకర్యాల నడుమ నడుస్తున్నందున 500 గజాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి నూతన భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. డిసెంబరులో నూతన భవనాన్ని ప్రారంభిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం రూ.3కోట్లు మాత్రమే ఉన్న సొసైటీ టర్నోవర్‌ను ప్రస్తుతం రూ.15కోట్లకు తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ కో–ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బొబ్బిలి సాయిబాబు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, విద్యా మౌళిక సదుపాయాల సంస్థ డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్రెల మాధవి, మున్సిపల్ వైస్ ఎంపీపీ కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, వైఎస్సార్ సీపీ నూజివీడు పట్టణ, ముసునూరు మండలాల అధ్యక్షుడు శీలం రాము, మూల్పూరి నాగవల్లేశ్వరరావు, ముసునూరు వైస్ ఎంపీపీ రాజానాయన, కేడీసీసీబీ డీజీఎం శ్రీనివాసరావు, కేడీసీసీబీ నూజివీడు బ్రాంచి మేనేజర్ క్రాంతిసుధ, నాయకులు అశోక్, రవీంద్రరెడ్డి, నాని, రాంబాబు, నాగవరప్రసాద్, రాజు పాల్గొన్నారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రాలు



తిరువూరు మండలం కొమ్మిరెడ్డిపల్లిలో ఆధార్ నమోదు కేంద్రం

తిరువూరురూరల్: ఆధార్ డేటా నవీకరించుకోని వారి కోసం తిరువూరు మండలంలోని రెండు గ్రామాల్లో మంగళవారం ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొమ్మిరెడ్డిపల్లి, మల్లేల గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల్లో ఆధార్ కార్డుల నవీకరణ, సవరణ, ఫొటో, చిరునామా మార్పు తదితర సేవలు పొందవచ్చని అధికారులు సూచించారు. బుధవారం కూడా ఇదే గ్రామాల్లో ఆధార్ సేవలు కొనసాగుతాయని తెలిపారు.

24, 25 తేదీల్లో ఆధార్ నమోదుకు క్యాంపులు

తిరువూరు: ఆధార్ కార్డుల్లో మార్పులు చేర్పులకు తిరువూరు మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. 24, 25 తేదీల్లో రోలుపడి, ఆంజనేయపురం, కాకర్ల గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న మంజునాథ్, అధ్యాపకులు

గుణదల(విజయవాడతూర్పు): విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సైబర్ సెక్యూరిటీస్ సీఈఓ ఎం.మంజునాథ్ తెలిపారు. ఆంధ్రలయోల కళాశాలలో పారిశ్రామిక వ్యవస్థపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. లక్ష్యసాధనలో అహర్నిశలు పాటుపడాలన్నారు. ఆధునిక సమాజంలో పారిశ్రామిక రంగం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. దేశ వ్యాప్తంగా పరిశ్రమల విస్తరణలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని చెప్పారు. విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని తెలిపారు. పారిశ్రామిక రంగంలో మనుగడ సాగించే వారంతా అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే స్థితికి చేరుతారని గుర్తు చేశారు. దేశ ఆర్థిక పురోగతి పారిశ్రామికవేత్తలపై ఆధారపడి ఉంటుందన్నారు. అనంతరం పరిశ్రమల విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లయోల కళాశాల అధ్యాపకులు ఆర్.పూర్ణిమ, ఎ.మంజుల, ఎ.లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం దుర్భరం చేసుకోవద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శేఖర్‌బాబు

కృష్ణలంక(విజయవాడతూర్పు): మత్తు పదార్థాలతో జీవితం దుర్భరం చేసుకోవద్దని, ఎటువంటి మత్తు పదార్థాలు తీసుకున్న అవి ప్రాణంతకమేనని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు విద్యార్థులకు సూచించారు. కృష్ణలంకలోని పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ పాఠశాలలో విద్యార్థులకు నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మంగళవారం మత్తు పదార్థాల దుర్వినియోగంపై ప్రాజెక్టర్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

అనారోగ్య సమస్యలు..

ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు సేవించడం వలన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. స్నేహితులు, మరే ఇతర వ్యక్తులు మాదక ద్రవ్యాలపై ప్రలోభపెడితే తిరస్కరించాలన్నారు. ఒకరి నుంచి ఒకరు చెడు అలవాట్లకు అలవాటు పడి తీవ్ర ప్రమాద స్థాయికి చేరుకుంటారన్నారని, క్యాన్సర్, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మత్తుకు బానిసలైన వారిని డీ–ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చన్నారు., ఈ చికిత్సా కేంద్రాన్ని నవజీవన్ బాలభవన్ సంస్థ ఆధ్వర్యంలో నూజివీడులో బోస్కో డీ–ఎడిక్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. వ్యసనానికి బానిసలైన విద్యార్థులు, యువతకు విముక్తి కలిగించేందుకు డాన్ బాస్కో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో పెజ్జోనిపేటలో ఏర్పాటు చేసిన నీ తోడు మానసిక వికాస కేంద్రాన్ని ఉచితంగా సంప్రదించవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 94904 92020 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రమేష్ మాట్లాడుతూ.. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ షేక్ నజ్మా, ఉపాధ్యాయులు ఎం.వరలక్ష్మి, అరవింద్, విద్యార్థులు పాల్గొన్నారు.